అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
# జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..




రెండు తెలుగు రాష్ట్రాల్లో పులుల కలకలం..
**భయం గుప్పిట్లో జనం**

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 279 మంగళవారం 3 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# నేరాలు చేసి విచారణలు వద్దంటారా?

**అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి**
**వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా**
**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్**
**రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు**

హైదరాబాద్, **ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు




ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో

# రాహుల్ చైనా వ్యాఖ్యలపై రచ్చ

**రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో లోక్‌సభలో తీవ్ర గందరగోళం**
**ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకంలోని అంశాలను ప్రస్తావించిన ప్రతిపక్ష నేత**
**రాజ్‌నాథ్, అమిత్‌షా తీవ్ర అభ్యంతరం**

న్యూఢిల్లీ, **ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);)**
రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం చెలరేగింది. 2020లో భారత్–చైనా సంక్షోభానికి సంబంధించి భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రస్తావించడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికార, విపక్షాల నడుమ వాగ్యుద్ధం, గందరగోళం నడుమ సభ మంగళవారానికి వాయిదాపడింది.
మిగతా 2లో...



# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

**బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2 ::**
బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. మిగతా 2లో...

# సుంకాలు తగ్గాయ్

**భారత్‌పై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ట్రంప్**
**ప్రధాని మోదీతో ఫోన్‌లో ట్రంప్ చర్చలు.. అనంతరం ట్రూత్ సోషల్‌లో పోస్టు**

న్యూయార్క్/న్యూఢిల్లీ **ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);**
భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత్‌పై ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఒప్పందం వెంటనే అమల్లోకి వస్తుందని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. బదులుగా రష్యా చమురు కొనుగోళ్లు ఆపేస్తామని, అమెరికా చమురు ఉత్పత్తులను భారీగా కొనుగోలుమిగతా 2లో...





# రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్

**ముఖ్యమంత్రి పదవి కూడా అలానే వచ్చిందేమో**
**కేసీఆర్ విచారణతో తెలంగాణ ఉద్యమం రోజులు గుర్తుకొచ్చాయి**
**సీఎం 60 సార్లు ఢిల్లీకి వెళ్లి సాధించింది ఏంటీ**
**ప్రభుత్వాన్ని నడపండి-బడ్జెట్‌పై దృష్టిపెట్టండిసజ్జనార్ జడ్జి కాదు**
**ఫోన్ ట్యాపింగ్‌లో ఆధారాలుంటే కోర్టుకివ్వాలి**
**దావోస్ పెట్టుబడులపై శ్వేతపత్రం ప్రకటించాలి**
**: మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్**

**హైదరాబాద్ ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);**
తాము తెలంగాణ ప్రజలకు గులాం, ఢిల్లీకి గులాం కాదనీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణ ప్రజలకు బానిసలుగా ఉంటామని చెప్పారు. సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్‌మెయిల్‌కు మిగతా 2లో...



# మున్సిపోల్స్ గైడ్‌లైన్స్ విడుదల

**మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికకు 50 శాతం కోరం ఉండాల్సిందే**
**ఫిబ్రవరి16న చేతులెత్తే పద్ధతిలో నిర్వహణ**

హైదరాబాద్:
మున్సిపల్ పరోక్ష ఎన్నికలకు సంబంధించి సోమవారం తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్లను నేరుగా ఎన్నికైన సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్లైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నుకుంటారు. ఎక్స్ అఫిషియో సభ్యులు తాము ఓటు వేయాలనుకున్న కార్పొరేషన్, మున్సిపాల్టీలో తమ ఓటు హక్కును ఫిబ్రవరి 11 నుంచి14 వరకు మిగతా 2లో...

# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

**సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ**




న్యూఢిల్లీ, **ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);**
కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. మిగతా 2లో...

# కేసీఆర్ విచారణ బూటకం!

**ఆయన, రేవంత్‌ది క్విడ్‌ప్రోకో -ఫోన్ ట్యాపింగ్ అసలు బాధితులం మేమే**
**రెండేళ్లయినా కేసును సాగదీస్తున్నారు -బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయలేదు?**
**బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు -కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ విడుదల**
**మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపు**

హైదరాబాద్, **ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);**
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ విచారించడం ఓ బూటకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. కేసు పెట్టి రెండేళ్లు పూర్తయినా కాంగ్రెస్ సర్కారు ఇంకా విచారణ పేరిట కాలయాపన చేస్తోందని విమర్శించారు. అసలుమిగతా 2లో...






# జోగిరమేశ్, అంబటిలపై దాడి ఏ రకమైనా ప్రజాస్వామ్యం

**గుండాలకు అండగా పోలీసులు నిలబడం దారుణం**
**జోగి రమేశ్ ఇంటిని పరిశీలించిన సజ్జల**

విజయవాడ,**ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);**
మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటనలో టీడీపీ గూండాలకు పోలీసులకు రక్షణగా నిలిచారని వైఎస్సార్‌సీపీ సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదుగంటల పాటు పోలీసుల సమక్షంలో అరాచకం రాజ్యమేలిందని ధ్వజమెత్తారు. మిగతా 2లో...



అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

**(మొదటి పేజీ తరువాయి)**

అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ – బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ – చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ – పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026–27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.

## జోగిరమేశ్, అంబటిలపై దాడి

# ఏ రకమైనా ప్రజాస్వామ్యం

**(మొదటి పేజీ తరువాయి)**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంపై టీడీపీ గూండాల దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిపై పరామర్శించేందుకు జోగి రమేష్ ఇంటికి సజ్జలతో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లారు. దాడికి సంబంధిచిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు. గుంటూరు పోలీసుల సమక్షంలో అంబటి రాంబాబు ఇంటిపై దాడులు చేశారు. గుంటూరులో టీడీపీ గూండాలు ఏం చేశారో రాష్ట్రప్రజలు చూశారు. టీడీపీ గూండాలకు పోలీసులు రక్షణగా ఉన్నారు. అంబటిని కలిసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు యత్నించారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన పార్టీ నేతల్ని అడ్డుకున్నారు. మాజీ హోంమంత్రి ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదు. బాధితుడినే పోలీసులు అరెస్టు చేశాను. మా నేతలను ఎస్పీ కార్యాలయంలో ఎదుట గంట సేపు ఎదురు చూయించారు. ప్లాన్ ప్రకారం అంబటి రాంబాబు,జోగి రమేష్ కుటుంబ సభ్యులపై దాడి జరిగింది. టీడీపీ గూండాలను పోలీసులు కంట్రోల్ చేస్తున్నట్లు యాక్ట్ చేశారు. జోగి రమేష్ కుటుంబానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని సజ్జల ప్రశ్నించారు. బటి,జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసిన గూండాలపై కేసులు పెట్టలేదు. దాడి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టలేదు. కూటమి నేతల అరాచకాల్ని ఎదుర్కొంటాం. కూటమి అరాచకాల్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తాం. చంద్రబాబు వైఎస్సార్‌సీపీ శ్రేణులు,నేతల్ని బెదిరింపులు, దాడులు చేసి బెదిరించాలని అనుకోవద్దు. అలా అనుకుంటే భ్రమే అవుతుంది'అని వ్యాఖ్యానించారు.

## నేరాలు చేసి విచారణలు వద్దంటారా?

**(మొదటి పేజీ తరువాయి)**

ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

**(మొదటి పేజీ తరువాయి)**

సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన అక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్–కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్‌ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీ ట్వీట్లను రీట్వీట్ చేసినందుకు గానూ సోషల్ మీడియా వారియర్ శశిధర్ గౌడ్, అలియాస్ నల్ల బాలుపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన మూడు కేసులను హైకోర్టు కొట్టివేసింది.

# కేసీఆర్ విచారణ బూటకం!

**(మొదటి పేజీ తరువాయి)**

ట్యాపింగ్ జరిగిందే బీజేపీ నాయకులపైన అన్నారు. తమ పార్టీ నాయకులపై కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. ట్యాపింగ్‌తోనే మునుగోడులో బీజేపీని ఓడించానికి బీఆర్ఎస్ సర్కారు ప్రయత్నించిందన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చి రెండేళ్లయినా నత్తనడకన విచారణ కొనసాగుతోందని, ఎవరిపైనా చర్యలు తీసుకోకుండా విచారణ మాత్రమే చేస్తున్నారని విమర్శించారు. బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ సర్కారు రేవంత్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, అందుకే ఇప్పుడు రేవంత్ సర్కారు కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఇది క్విడ్‌ప్రోకో కిందకే వస్తుందన్నారు. నాడు బీఆర్ఎస్ రేవంత్‌కు సాయం చేయగా.. ఇప్పుడు ఆయన బీఆర్ఎస్ పార్టీకి సాయం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు కేవలం విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇది యాక్టింగ్ మాత్రమేనని, యాక్షన్ కాదని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మునిసిపాలిటీల్లో రూ.2500 కోట్ల కుంభకోణం జరిగిందని, ప్రజల నుంచి పన్నుల డబ్బులు కాంగ్రెస్ నేతల జేబుల్లోకి వెళుతున్నాయని రాంచందర్‌రావు విమర్శించారు. ఏ మునిసిపాలిటీలోనూ రోడ్లు, డ్రైనేజీలు లేవని.. కనీస మౌలిక వసతులు కొరవడ్డాయని ఆరోపించారు. "బూటకపు హామీలు–మోసపూరిత వాగ్దానాలు" పేరుతో కాంగ్రెస్ పాలనపై రూపొందించిన చార్జిషీట్‌ను సోమవారం తెలంగాణ మునిసిపల్ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జి ఆశిష్ షెలార్, మరో ఇన్‌చార్జి అశోక్ పర్ణామి, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి రాంచందర్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. 6 గ్యారెంటీలు, 420 హామీలతో మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. పట్టణాలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ పనులకు కేంద్రం నుంచి వచ్చే నిధులే ఆధారమవుతున్నాయని చెప్పారు.

# మున్సిపోల్స్ గైడ్‌లైన్స్ విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**

సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేసే వరకు నమోదు చేసుకోవచ్చు.

ఫిబ్రవరి 16న ఎన్నికైన సభ్యులతో సంబంధిత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అదే రోజు చేతులెత్తే పద్ధతిలో కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్లను ఎన్నుకుంటారు ఎన్నికైన సభ్యుల్లో 50 శాతాన్ని కోరంగా పరిగణిస్తారు. అంతకన్నా తక్కువ మంది హాజరైనా, మరే ఇతర కారణాల చేత సమావేశం వాయిదా పడినా..ఆ ఎన్నికను తదుపరి రోజు నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ఎన్నికైన అభ్యర్థులు విప్ ఆదేశాలను పాటించకుంటే ఆయా పార్టీలు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారు.

**ఎక్స్ అఫిషియో సభ్యుల ఓటు నమోదు చేయండి**

**జిల్లా కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశం**


మున్సిపల్ పరోక్ష ఎన్నికల్లో పాల్గొనే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటు హక్కు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ పరోక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 11 నుంచి 14 వరకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ చైనా వ్యాఖ్యలపై రచ్చ

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నిస్తూ తీవ్రంగా విమర్శించారు. తర్వాత మాట్లాడిన రాహుల్... తొలుత ఆయన విమర్శలకు స్పందిస్తానంటూ భారత్–చైనా సంక్షోభంపై జనరల్ నరవణె తన పుస్తకంలో పేర్కొన్న స్మృతులను ప్రస్తావించేందుకు ప్రయత్నించారు. మంత్రి రాజ్‌నాథ్ అభ్యంతరం తెలిపారు. ఆ పుస్తకం ప్రచురితమైందో లేదో రాహుల్ స్పష్టత ఇవ్వాలన్నారు. అయితే చైనా ట్యాంకులు అన్న పదాన్ని విపక్ష నేత పదే పదే లేవనెత్తాలని చూడడంతో సభలోని ప్రతి బీజేపీ నేతా తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. ఆ పుస్తకం అధికారికం కాదని.. ఇంతవరకు ప్రచురణకే నోచుకోలేదని.. దానిలోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని రాజ్‌నాథ్ నిలదీశారు. సైనిక దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ సమయంలో సభలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను ఆయన ఎలా ప్రస్తావిస్తారని అమిత్‌షా నిలదీశారు. తన మాటలకు వారు భయపడకపోతే ఎందుకు మాట్లాడనివ్వడం లేదని రాహుల్ ప్రశ్నించారు. తాను చదివేది నూరు శాతం అధికారికమన్నారు. సభ కార్యకలాపాలతో సంబంధం లేని పుస్తకం లేదా దినపత్రిక క్లిప్పింగ్‌లలోని అంశాలను ప్రస్తావించడానికి వీల్లేదని స్పీకర్ ఓం బిర్లా రూ లింగ్ ఇచ్చారు. అయితే తాను చదువుతున్నది అధికారికమైనదేనని, దాని నుంచి కోట్ చేస్తానని రాహుల్ స్పష్టంచేశారు. ఆ పుస్తకాన్ని ప్రచురించలేదని.. అందుచేత దానిని ప్రస్తావించడానికి వీల్లేదని రాజ్‌నాథ్ పునరుద్ఘాటించారు.

జనరల్ నరవణె రాసిన పుస్తకాన్ని ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదని రాహుల్ ఆరోపించారు. తన వైఖరిని తెలియజేసేందుకు వేరే మ్యాగజైన్



వ్యాసంలోని అంశాలను ప్రస్తావిస్తున్నానని చెప్పారు. దీనిని కూడా స్పీకర్ అనుమతించలేదు. రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. రాహుల్ ఆరోపిస్తున్నట్లు ప్రభుత్వం గనుక ఆ పుస్తకం ప్రచురణను అంగీకరించనట్లయితే జనరల్ నరవణె కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. సభను ఆయన తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సభాపతి రూలింగ్ ఇచ్చిన తర్వాత కూడా విపక్ష నేత దానిని ఉల్లంఘిస్తున్నారని మంత్రి రిజిజు ఆక్షేపించారు. ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించొద్దని ఓం బిర్లా పలు సార్లు హెచ్చరించినా రాహుల్ వినిపించుకోలేదు. రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడడం ఆయనకు ఇష్టం లేకపోతే తదుపరి వక్తగా ఉన్న ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు అవకాశమిస్తానని సభాపతి స్పష్టంచేశారు. అఖిలేశ్, టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ తదితరులు రాహుల్‌కు మద్దతిచ్చారు. అటు విపక్షం, ఇటు అధికార పక్ష సభ్యులు పరస్పరం నినాదాలకు దిగడంతో స్పీకర్ తొలుత మధ్యాహ్నం 3 గంటల వరకు ఒకసారి.. 4గంటల వరకు రెండోసారి సభను వాయుదావేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేదు. చివరకు సభ మంగళవారానికి వాయిదాపడింది.

**స్పీకర్ ముందస్తు అనుమతితోనే..:**

పుస్తకాలు, మ్యాగజైన్లు, పత్రికల్లోని అంశాలను ప్రస్తావించడంపై పార్లమెంటు నిబంధనల్లో నిషేధం లేదని పార్లమెంటరీ నిపుణులు స్పష్టం చేశారు. అయితే ప్రచురితమైన వాటిలోని అంశాలను స్పీక ర్ అనుమతితో ప్రస్తావించవచ్చని.. అయితే ఆయనకు ముందస్తు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని రాజ్యసభ మాజీ సెక్రటరీ జనరల్ వీకే అగ్నిహోత్రి తెలిపారు. 'లోక్‌సభలోని 349(1) నిబంధన ఏం చెబుతోందంటే.. సభ సమావేశమైనప్పుడు.. సభ కార్యకలాపాలతో సంబంధం ఉంటే తప్ప ఏ పుస్తకం, దినపత్రిక, లేఖను కూడా చదవరాదు. స్పీకర్ అనుమతించినా.. తాను చదివే సమాచారం ధ్రువీకరణ గురించి ఆ సభ్యుడిని ప్రశ్నించవచ్చు. ప్రచురించని పుస్తకంలోని అంశాలను ప్రస్తావించాలని రాహుల్ ప్రయత్నించారు' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**నన్ను మాట్లాడనివ్వడం లేదు: రాహుల్**

జనరల్ నరవణె పుస్తకంలోని అంశాలను సభలో తనను లేవనెత్తనివ్వడం లేదని, తనను మాట్లాడనివ్వడంలేదని రాహుల్ ఆరోపించారు. చైనాతో సంక్షోభానికి సంబంధించి ప్రధాని మోదీని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను జనరల్ అందులో తప్పుబట్టారని పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులకు తెలిపారు. ఆయన అభిప్రాయాలు ఓ వ్యాసంలో వచ్చాయని.. వాటినే తాను ప్రస్తావించానని చెప్పారు. అది బయటకు వస్తే వారిద్దరి బండారం బయటపడుతుందని.. అందుకే తాను ప్రస్తావించిన వాక్యాలు అధికార పక్షాన్ని భయపెడుతున్నాయన్నారు. జనరల్ నరవణె రాసిన పుస్తకం ప్రచురణకు నోచుకోకుండా మగ్గిపోతోందన్నారు. రాహుల్‌ను ఆయన సోదరి, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా గట్టిగా సమర్థించారు. ఆయన మన సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం లేదని.. ఆర్మీ చీఫ్ పుస్తకం నుంచే ప్రస్తావిస్తున్నారని.. తాము దాచదలచుకున్న అంశాలు బయటకు వచ్చినప్పుడల్లా బీజేపీ నేతలు ఇలాగే చేస్తుంటారని ధ్వజమెత్తారు.

# రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్

**(మొదటి పేజీ తరువాయి)**

బ్రాండ్ అంబాసిడర్ రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఆర్టీఐ ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడం ఆయన వృత్తి అని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని కూడా బ్లాక్‌మెయిల్ చేసి తెచ్చుకున్నాడేమోనని ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌ను సిట్ విచారణ చేసిన నేపథ్యంలో ఆదివారం దాదాపు ఏడు వేలకుపైగా గ్రామాలు, పట్టణాల్లో నిరసనలు, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు జరిగాయని అన్నారు. తెలంగాణ ఉద్యమం రోజులు, ఉద్యమ స్ఫూర్తి గుర్తుకొచ్చాయని చెప్పారు. తమలో స్ఫూర్తిని నింపిన బీఆర్ఎస్ కార్యకర్తలకు, వారిని తట్టిలేపిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు ప్రకటించారు. కేసీఆర్ సిట్ విచారణకు రావాల్సిన అవసరం లేదన్నారు. కోర్టుకు వెళ్లే అవకాశముందని అన్నారు. అధికారికంగా 900 మంది పోలీసులు, అనధికారికంగా రెట్టింపు మంది ఉన్నారని వివరించారు.

పరిపాలనా వైఫల్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇబ్బంది పడుతున్నారని కేటీఆర్ అన్నారు. మేడారం జాతర తెలంగాణ కుంభమేళా అని చెప్పారు. అధికారంలో ఎవరున్నా ఏర్పాట్లు ఘనంగా ఉంటాయని వివరించారు. నామమాత్రంగా మంత్రివర్గ సమావేశాన్ని ములుగులో నిర్వహించారని అన్నారు. ఏర్పాట్లు సరిగ్గా చేయనందుకు జాతర సందర్భంగా మంత్రి కారు అద్దాలను పగలగొట్టారని చెప్పారు. సుల్తాన్‌బజార్‌లో పట్టపగలు ఉదయమే ఏటీఎం వద్ద కాల్పులు జరిపి రూ.లక్ష ఎత్తుకెళ్లారని అన్నారు. శాంతిభద్రతల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం ఉందన్నారు. సహజ వనరులను, జల వనరుల దోపిడీని ప్రభుత్వం కాపాడ్డం లేదని చెప్పారు.

పాత బాసు చంద్రబాబు, కేసుల కోసం కేంద్రాన్ని ఏమీ అనడం లేదన్నారు. సింగరేణిలో సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి దోపిడీపై బయటపెట్టినా భట్టి, కిషన్‌రెడ్డి సరైన సమాధానం చెప్పకుండా బుకాయిస్తున్నారని విమర్శించారు. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. సింగరేణిలో ఎంత మంది సైట్ విజిట్‌కు వచ్చారో శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. దానికోసం సృజన్‌రెడ్డి ఫోన్ చేసిన కాల్ డేటాను చూస్తే అన్ని విషయాలు బయటకొస్తాయని అన్నారు. పాలనా వైఫల్యం, భూదోపిడీ, జలదోపిడీ, బొగ్గు దోపిడీ, శాంతి భద్రతల వైఫల్యం కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మరల్చడం కోసమే కేసీఆర్‌కు సిట్ నోటీసుల పేరుతో డ్రామా నడిపించారని విమర్శించారు.

**సజ్జనార్ అత్యుత్సాహం మంచిది కాదు**

సిట్ చీఫ్ సజ్జనార్ జడ్జి కాదని కేటీఆర్ అన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి ఆయన వద్ద ఏమైనా సమాచారం ఉంటే కోర్టుకు ఇవ్వాలని సూచించారు. చట్టబద్ధమా? చట్టవిరుద్ధమా? అనేది కోర్టు నిర్ణయిస్తుందన్నారు. సజ్జనార్‌కు అత్యుత్సాహం మంచిది కాదని చెప్పారు. తమ పార్టీ నాయకుడు కేసీఆర్‌ను అక్రమ కేసులతో వేధిస్తే ఊరుకుంటామా?, తప్పకుండా స్పందిస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూడుసార్లు దావోస్ పర్యటనకు వెళ్లారని చెప్పారు. ఆ పెట్టుబడులపై శ్వేతపత్రం ప్రకటించాలనీ, ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్, మేఘా కృష్ణారెడ్డి జూబ్లీహిల్స్‌లోనే ఉన్నా దావోస్‌కు వెళ్లి ఒప్పందం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

**మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటుతాం**

మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటుతామని కేటీఆర్ అన్నారు. ఎక్కడికక్కడ స్థానికంగా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. రోడ్‌షోలు, అట్టహాసం చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 143 మున్సిపాల్టీల్లో 135 వరకు గెలిచామని అన్నారు. ఇప్పుడు 116 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లలో మెజార్టీ స్థానాలను గెలుస్తామని చెప్పారు. సిర్పూర్, షాద్‌నగర్ మున్సిపాల్టీలను తప్పకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# సుంకాలు తగ్గాయ్

**(మొదటి పేజీ తరువాయి)**

చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని వెల్లడించారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ వసూలు చేస్తున్న టారిఫ్‌లను దశలవారీగా సున్నాకు తగ్గిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై వేసిన అదనపు 25శాతం సుంకాల అంశాన్ని ట్రంప్ ప్రస్తావించలేదు. కానీ భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ సోమవారం రాత్రి జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌పై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించినట్టుగా వెల్లడించారు. మరోవైపు సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 18శాతానికి సుంకాలను తగ్గించడంపై ట్రంప్‌కు 140 కోట్ల మంది భారతీయుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నట్టు ప్రకటించారు. అయితే రష్యా చమురు కొనుగోళ్ల నిలిపివేత తదితర అంశాలు వేటినీ మోదీ ప్రస్తావించలేదు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందంటూ గతేడాది జూలైలో 25శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా నుంచి వద్దన్న చమురు కొంటోందంటూ ఆగస్టులో సుంకాలను 50శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

సోమవారం ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో తొలుత ఈ విషయాన్ని వెల్లడించారు. తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. "నా గొప్ప స్నేహితుల్లో ఒకరు, శక్తివంతమైన నేత ప్రధాని మోదీతో మాట్లాడాను. వాణిజ్యం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడం సహా చాలా అంశాలపై చర్చించాం. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేసేందుకు.. అమెరికా నుంచి, ముఖ్యంగా వెనెజువెలా నుంచి భారీగా చమురు కొనుగోలు చేసేందుకు మోదీ అంగీకరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ఇది తోడ్పడుతుంది. మిత్రుడు మోదీ విజ్ఞప్తి మేరకు, ఆయనపై గౌరవంతో.. యూఎవీస–భారత్ వాణిజ్య ఒప్పందానికి అంగీకరించాం. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. భారత్‌పై అమెరికా ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నాం. బదులుగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలను క్రమంగా సున్నాకు తగ్గిస్తుంది. వాణిజ్య అడ్డంకులను తొలగిస్తుంది. రూ.45.5 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల) విలువైన అమెరికా చమురు, బొగ్గు, సాంకేతిక, వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుంది. దీనికి అదనంగా వీలైనంత ఎక్కువగా అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. భారత్‌తో మా బంధం మరింత బలోపేతం అవుతుంది. ప్రధాని మోదీ, నేను ఇద్దరం గొప్ప పనులు పూర్తి చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మూడు రోజుల పర్యటన కోసం సోమవారం వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అరుదైన ఖనిజాల సరఫరాకు సంబంధించిన సమావేశంలో పాల్గొననున్నారు.

భారతీయ సైనిక అమరులకు గుర్తుగా ఢిల్లీలో ఠీవిగా నిలబడిన 'ఇండియా గేట్'పై ట్రంప్ కన్ను పడింది. అలాంటిది తమకూ కావాలని అనిపించింది. ట్రంప్ స్వయంగా దీనిపై ట్రూత్ సోషల్‌లో ఇండియా గేట్ ఫొటోతో పోస్టు పెట్టారు. "ఇది భారత్ విజయ ద్వారం. మేం కట్టబోయేది ఇలాంటి వాటన్నింటికన్నా గొప్పగా ఉంటుంది" అని పేర్కొన్నారు. తర్వాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా నగరాలకు విజయ ద్వారాలు ఉన్నాయని.. గొప్ప దేశమైన అమెరికాలోని వాషింగ్టన్‌లో మాత్రం లేదని పేర్కొన్నారు. పారిస్‌లోని 'ఆర్క్ డె ట్రయంఫ్' తరహాలో ప్రపంచంలోనే గొప్పగా, అందంగా వాషింగ్టన్‌లో విజయ ద్వారాన్ని నిర్మిస్తామని చెప్పారు.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ సెటైర్లు వేశారు. "ఆపరేషన్ సిందూర్ ఆగినప్పుడు, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి.. ఇప్పుడు వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా నుంచి ట్రంపే మొదట ప్రకటించారు. ట్రంప్‌తో మోదీ మాట్లాడిన విషయాన్ని కూడా అమెరికా రాయబారి ప్రకటించారు. మోదీ ప్రభుత్వ నిర్ణయాలను మన ప్రభుత్వం నుంచి కాకుండా.. అమెరికా అధ్యక్షుడి నుంచి భారత ప్రజలు తెలుసుకుంటున్నారు. మోదీ పూర్తిగా ట్రంప్‌కు లొంగిపోయారు. మోదీ ఆత్మ నిర్భరత కాదు.. ట్రంప్ నిర్భరత" అని విమర్శించారు.

జర్నలిస్ట్ వార్త
మంగళవారం 3 ఫిబ్రవరి 2026

# కాంగ్రెస్ తండా హామీ ఓట్ల కోసమే..

## ఆచరణ సాధ్యం కాదు - అరూరి రమేష్




**వర్ధన్నపేట/ఫిబ్రవరి 2(జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికల నగారా మోగుతున్న వేళ వర్ధన్నపేట నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఇటీవల బిఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మున్సిపల్ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నికల క్షేత్రంలో దూసుకుపోతున్నారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో 12 వార్డుల ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రత్యర్థి పార్టీలపై విమర్శనాస్త్రాలు ప్రయోగిస్తున్నారు.



### శాస్త్రీయత లేని హామీలతో వంచన

తండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామన్న కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని అరూరి రమేష్ సాంకేతిక అంశాలతో ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:మున్సిపల్ చట్టం ప్రకారం ఎన్నికైన కౌన్సిలర్లు ఐదేళ్ల పాటు పదవిలో ఉండాలి. ప్రస్తుత ప్రభుత్వం మరో మూడు ఏళ్లు మాత్రమే అధికారంలో ఉంటుంది. పదవీకాలంపై స్పష్టత లేకుండా ఇలాంటి హామీలు ఇవ్వడం బంజారీ సోదరులను రాజకీయంగా మోసం చేయడమే. నన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని కార్యకర్తలు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ప్రతి వార్డులో ప్రత్యర్థి పార్టీల మాయమాటలను తిప్పికొట్టేలా పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

### గెలుపే లక్ష్యంగా గులాబీ శ్రేణుల సమరోత్సాహం

అరూరి రమేష్ తిరిగి బిఆర్ఎస్‌లోకి రావడం పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

ఈ కార్యక్రమంలో రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకన్న, మెట్టు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మండల అధ్యక్షుడు టి. కుమార స్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ అరుణ భాస్కర్, వైస్ చైర్మన్ ఎలేందర్ రెడ్డి, సర్పంచ్ దుగ్యాల మాధవరావు, ఐనవోలు మండల బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మిద్దె పాక రవీందర్, తదితర బిఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బండవుతాపురంలో విషాదం

## : మృతుని కుటుంబానికి మార్నేని రవీందర్ రావు పరామర్శ



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**



వర్ధన్నపేట మండల పరిధిలోని బండవుతాపురం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన దామెర బుచ్చయ్య అనారోగ్యంతో కన్నుమూయడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సోమవారం బుచ్చయ్య నివాసానికి వెళ్ళిన మాజీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మృతుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ బుచ్చయ్య మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పిస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రవీందర్ రావు తో పాటు స్థానిక నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బుచ్చయ్యకు నివాళులు అర్పించారు.

# మండల స్థాయి సీఎం కప్ క్రీడలు



**నర్సంపేట/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం నుంచి మండల స్థాయి సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ క్రీడలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని పేర్కొన్నారు.

క్రీడల్లో పాల్గొనే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని, గ్రామ స్థాయిలో ఇప్పటికే నమోదు చేసుకున్న వారు సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రింట్‌ను కూడా వెంట తెచ్చుకోవాలని సూచించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ పోటీలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగ, అథ్లెటిక్స్ విభాగాల్లో సెలెక్షన్లు జరుగుతాయని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఎంఈవో వెల్లడించారు.

# బిర్రు యాకయ్య కుటుంబానికి అరూరి రమేష్ పరామర్శ




**వర్ధన్నపేట/ఫిబ్రవరి 2(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్ తండ్రి యాకయ్య దశదిన కర్మ కార్యక్రమానికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరయ్యారు. ఆదివారం గ్రామానికి చేరుకున్న ఆయన, యాకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా యాకయ్య మృతి పట్ల అరూరి రమేష్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. యాకయ్య మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం బిర్రు మహేందర్ సహా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరూరి రమేష్ వెంట మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ సర్పంచ్ దుగ్యల మాధవరావు , మార్కెట్ చైర్మన్ సంపత్ రెడ్డి, నూతన ఉప సర్పంచ్ దేవేందర్ స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ వేద ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభం

## ప్రారంభించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్



**రాయపర్తి / ఫిబ్రవరి 1 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన ఓరుగంటి నాగరాజ్ వరంగల్ శివనగర్‌లోని అండర్‌బ్రిడ్జి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వేద ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎర్రబెల్లి ప్రదీప్ రావుతో కలిసి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన పరుపాటి శ్రీనివాస్, యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి వ్యాపారాలు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లేతాకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, భూక్య జగన్, బోరిగా వేణు, వెలిశాల మహేందర్, తాళ్లపెల్లి రమేష్, మేకల మహేష్, బొమ్మెరబోయిన మహేష్, దుండి యాకేష్, నాకిర్త అశోక్, చిలువేరు రాజు, బోరిగా సంతోష్, పిరని వెంకన్న, సంకినేని ఎల్లస్వామి, ఐత రవి తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్ అద్దంకి సురేష్‌కు నివాళులర్పించిన జర్నలిస్టులు



**తల్లాడ /ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన రిపోర్టర్ అద్దంకి సురేష్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జర్నలిస్టులు, స్నేహితులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సంతాప సానుభూతిని తెలియజేశారు. అద్దంకి సురేష్ జర్నలిజం రంగంలో చేసిన సేవలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. నివాళులు అర్పించిన వారిలో ఉపాధ్యాయులు మేడి నాగేశ్వరరావు, జర్నలిస్టులు గొడ్ల బాబురావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నారపోగు ప్రసాద్, కాంపాటి రవి, ఇస్నపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, గొల్లమందల దేవా తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ అవగాహన

## నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించిన కె. పురుషోత్తం




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక వరంగల్ ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండలంలోని పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన కె. పురుషోత్తం (పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షులు, అటవీ శాఖ మాజీ అధికారి), ధర్మసాగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్తడి నేలల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర, చెరువులు మరియు నీటి వనరుల సంరక్షణపై వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

అలాగే ధర్మసాగర్ సెయింట్ మాథ్యూస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా ముఖ్య అతిథిగా పాల్గొని, పర్యావరణ పరిరక్షణ, చెరువుల రక్షణ, నీటి వనరుల సంరక్షణ అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక నుండి ప్రధాన కార్యదర్శి టి. శ్రవణ్ కుమార్, ప్రతినిధులు దళపతి, శంకర్ రావు, కుమారస్వామి పాల్గొన్నారు. సెయింట్ మాథ్యూస్ ఉన్నత పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయులు షెరిల్ జాయ్, ఉప ప్రధానోపాధ్యాయులు ఆర్. మహేశ్వరి, ఉపాధ్యాయులు రవికుమార్ పాల్గొనగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు శ్రీనాథ్, పాల్గునాచారి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# సి కె న్యూస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

## ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే డా.మట్టా రాఘమయి

**తల్లాడ / ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**
సి కె న్యూస్ తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీమతి కొండా సురేఖ, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాఘమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. మట్టా దయానంద్ ఘనంగా ఆవిష్కరించారు. ఆదివారం సత్తుపల్లి మాధురి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కల్లూరు, సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం సందర్భంగా క్యాలెండర్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిత్యం వార్తల సేకరణలో ముందుండే సి కె న్యూస్ తెలుగు దినపత్రిక యాజమాన్యాన్ని అభినందించారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి కె న్యూస్ రిపోర్టర్ విజయ్, సీనియర్ జర్నలిస్టులు సీతారాములు, చారి, స్థానిక జర్నలిస్టులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బిర్రు యాకయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు





**వర్ధన్నపేట/ఫిబ్రవరి2(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్ తండ్రి యాకయ్య దశదిన కర్మ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హాజరై యాకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జ్ఞాపకార్థ కూడికలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ యాకయ్య మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. సాదాసీదా జీవితం గడుపుతూ విలువలతో బతికిన యాకయ్య అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన స్మారకార్థం విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బిర్రు మహేందర్ తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, మంద కృష్ణ మాదిగకు అండగా ఉంటూ మంచి నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పసునూరి దయాకర్, నిమ్మాని శేఖర్ రావు, బానోతు



సింగిలాల్, బిర్రు మౌనికరాజు, తాటికాయల దిలీప్, మరుపట్ల ప్రశాంత్, ఎల్లబోయిన సదానందం, ఆరేళ్లీ నాగరాజు, బిర్రు సురేందర్, బిర్రు గోపాల్, యాకయ్య, చంద్రయ్య, గోలి పుల్లయ్య, గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన తాటికాయల ఇస్తారి (90) ఇటీవల మృతి చెందగా, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం వారి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి, ఇస్తారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ గిన్నారపు లత, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు

**- మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**రాయపర్తి/ఫిబ్రవరి 1(జర్నలిస్ట్ వార్త):**
బిఆర్ఎస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం బి ఆర్ ఎస్ నాయకులు వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై చేపట్టిన ధర్నా రాస్తారోకో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజి మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రజల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన మహనీయుడు కేసీఆర్ అని అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలోనే నవంబర్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు.గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సాగు నీరు,త్రాగు నీరు లేక గ్రామాలన్నీ అధ్వానంగా ఉండేవని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 24 గంటల కరెంటు,సాగునీరు,త్రాగునీరు ఇచ్చి గ్రామాలన్నీ అభివృద్ధి చేసిందని అన్నారు.ఎన్నికల్లో ప్రజలకు ఇవ్వని హామీలు సైతం వృద్ధులకు 2000 పెన్షన్,రైతు బంధు,కళ్యాణ లక్ష్మి వంటి పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేసిన ఘనత కేసీఆర్ దని అన్నారు.420 హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చిన లేదని అన్నారు.ఇటివల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు.రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయనే ఉద్దేశ్యంతో బిఆర్ఎస్ నాయకులను తప్పుదోవ పట్టించేందుకు సిట్ విచారణ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్,మాజి ఎంపీపీ జినుగు ఎనిమి రెడ్డి,మాజి జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మాజి పాక్స్ ఛైర్మెన్ కుందూరు రామచంద్రారెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి,భూక్యా భద్రు నాయక్,కుక్కల భాస్కర్,భూక్యా దీప్ల నాయక్,చేడుపాక కుమార్, గారే నర్సయ్య,ఐత రాంచందర్, చందు రాము,సంకినేని ఎల్లాస్వామి, గారే విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



**రాయపర్తి/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 6, 7 తేదీలలో నిర్వహించనున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి కిషన్, మండల తహసిల్దార్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు.సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ, సీఎం కప్ పోటీలలో వాలీబాల్, కబడ్డీ, యోగా, ఖో-ఖో, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ వంటి క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్ నమోదు ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో పాటు శుక్రవారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కొమ్ము శ్రీనివాస్, నాగరాజు, అన్వర్, సమ్మయ్య, సందీప్, నరేష్, రమేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ బియ్యం అందజేత



**రాయపర్తి/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మాదగాని లచ్చమ్మ, కూరపాటి అంశమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో, సోమవారం బాధిత కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యంతో పాటు ఆయిల్ క్యాన్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లేతాకుల రంగారెడ్డి, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, పిరని వెంకన్న, ఐత రవి, సంకినేని ఎల్లస్వామి, చందు రాము, తెరాల యాకయ్య, చిర్ర శ్రీను, కేతం ఎల్లయ్య, తెరాల సదానందం, కూరపాటి ముతేయ్య, కెక్కర్ల సదానందం, కనుక్కుట్ల కుమార్, స్వామి కొండేటి, లక్ష్మయ్య, మేడి రాము, కొరపాటి మధు, దురుశెట్టి వెంకన్న, కొండేటి లక్ష్మయ్య, రాసల రామ్మూర్తి, కొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ రాజకీయ నాయకుల ఆధిపత్యానికి ముగింపు అవసరం

**బీసీఎస్సీఎస్టీ వర్గాలకు అధికారమే నా ఎజెండా - వంగ శిరీష రవి యాదవ్**

**నర్సంపేట /ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేటలో సంవత్సరాలుగా అగ్రవర్ణ రాజకీయ నాయకులే ఆధిపత్యం కొనసాగిస్తూ, భూముల కబ్జాలు, అక్రమ హౌసింగ్ పర్మిషన్లు, కోర్టులో ఉన్న భూములపైనా దౌర్జన్యాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని 17వ వార్డు అభ్యర్థి వంగ శిరీష రవి యాదవ్ ఆరోపించారు.
నర్సంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూడ గతంలో ఈ వార్డు 12వ వార్డుగా ఉన్నప్పుడు కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల తరఫున కౌన్సిలర్లుగా గెలిచినప్పటికీ, అభివృద్ధి మాత్రం ఎక్కడా కనిపించలేదన్నారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత లాభాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. పేద ప్రజలకు ఎలాంటి సహాయం చేయలేదని, అట్టడుగు వర్గాలకు అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు.
తాము గెలుపొందిన తర్వాత నర్సంపేట అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, పేద ప్రజలకు అండగా నిలబడతామని స్పష్టం చేశారు. భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై అధికారులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని, ముఖ్యంగా భూదందాలకు పాల్పడే వారిని ఎట్టి




పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.
ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులు గతంలోనే పదవులు అనుభవించినవారని, సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని అన్నారు. తాము బీసీ రాజ్యాధికార సమితి, బీసీ యునైటెడ్ ఫ్రంట్ నుంచి పోటీ చేస్తున్నామని, బడుగు బలహీన వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని తెలిపారు.
పేద ప్రజలకు కూడా రాజకీయాల్లో అవకాశం కల్పించి, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించాలనే దృక్పథంతో ముందుకు వస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం ప్రజలను ప్రలోభాలకు గురి చేయవద్దని, భయభ్రాంతులకు లోను చేయకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఓట్లు అడగాలని ఇతర



అభ్యర్థులకు సూచించారు. మీరు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు.
ఈ కార్యక్రమంలో ముత్యాల నవీన్, ఎండి.ఎజాజ్, రమ, శ్రీలత, బి.అమల, ఎండి.నూర్జాన్, జరీనా, షమీం బేగం, ఐషా జాబిన్, సుల్తాన్ అనిత, హస్కరి షహీన, అమల సనా, పారిహీన్, మత్సార్ వాణి, హైమ, సాదియా, బాలమ్మ, వినోద తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

**.11 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నీల రాజమ్మ గట్టయ్య**

**స్టేషన్ ఘన్ పూర్/ఫిబ్రవరి 02 (జర్నలిస్ట్ వార్త ) :**
ఆశీర్వదించి గెలిపిస్తే వార్డు ను అన్నివిధాల అభి వృద్ధి చేసి చూపిస్తానని 11 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నీల రాజమ్మ గట్టయ్య కోరారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం నీల రాజమ్మ గట్టయ్య సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ తనను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందజే స్తూ, ప్రజాల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు వార్డులోని ప్రతి ఇంటికి అందేలా కృషి చేస్తానన్నా రు. వార్డులోని ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీల నరసింహులు, తదితర కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



# స్టేట్ లెవెల్ సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఊకల్ విద్యార్థి ఎంపిక




**రాయపర్తి/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి. విష్ణు ప్రతిభ మరోసారి మెరిసింది. వరంగల్ జిల్లాలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ యాకుబ్పుర స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మూడవ బహుమతి సాధించిన ఆయన, రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. ఇదే పాఠశాల నుంచి గత సంవత్సరం కూడా స్టేట్ లెవెల్ సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికై విష్ణు తన సత్తాను చాటుకున్నాడు. విద్యార్థి సాధించిన ఈ ఘనతపై మండల విద్యాధికారి వెన్నంపల్లి శ్రీనివాస్ సోమవారం విష్ణును, ఆయనకు మార్గనిర్దేశం చేసిన గైడ్ టీచర్ సంకూరి రాజును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షులు తాటిపాముల రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని విష్ణు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# స్వచ్ఛత దిశగా గట్లనర్సింగాపూర్ అడుగు

## ప్రతి వార్డులో పారిశుధ్య పనులు: సర్పంచ్ అజయ్‌కుమార్



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి2 (జర్నలిస్ట్ వార్త):** హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 2వ తేదీన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని 1వ వార్డు నుంచి 12వ వార్డు వరకు రోజుకు ఒక వార్డు చొప్పున పారిశుధ్య పనులు చేపట్టి, ఐదు సంవత్సరాల పాటు నిరంతరంగా కొనసాగించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 1వ వార్డులో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి స్వయంగా పాల్గొని పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు 1వ వార్డు సభ్యులు దుర్షనపెల్లి మంగ, 2వ వార్డు సభ్యులు పెద్దబోయిన రమాదేవి హరికృష్ణ యాదవ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ విద్యార్థి వ్యతిరేకం

## : యు ఎస్ఎ ఎఫ్ ధ్వజం



**బీమదేవర పెళ్ళి/ఫిబ్రవరి(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని, ఇది విద్యను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టడమేనని హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్ విమర్శించారు. నిరుద్యోగ నిర్మూలనకు హామీలు లేవని, నిధుల కోతతో ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడుతూ, తక్షణమే బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఒక మంచి వార్త: స్కాలర్‌షిప్ నిధుల విడుదల ఉన్నా, క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఊరటనిచ్చే ఒక సానుకూల వార్త ఉంది: పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల జమ: గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మర ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయడం ప్రారంభించింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అవుతోంది. ఉద్యోగ అవకాశాలు: ఇదే సమయంలో, నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఈ నెలలో వివిధ ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల్లో 50,000 పైగా ఖాళీలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించనున్నట్లు సమాచారం.

# 9వ డివిజన్‌లో ఆరెల్లి సుమలత నాగార్జున జోరుగా ఎన్నికల ప్రచారం



**వర్ధన్నపేట,/ఫిబ్రవరి 2(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణంలోని 9వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి ఆరెల్లి సుమలత నాగార్జున తన ఎన్నికల ప్రచారాన్ని సోమవారం ముమ్మరంగా ప్రారంభించారు. సామాజిక కార్యకర్తగా గత పదేళ్లుగా స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుమలతకు ప్రచారంలో భాగంగా ఇంటింటా సానుకూల స్పందన లభిస్తోంది. గత ఎన్నికల్లో వార్డు సభ్యురాలిగా స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ, నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో ఈసారి కూడా ప్రజల మద్దతు తనకే ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకపోయినప్పటికీ, ప్రజల మీద నమ్మకంతోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు, రంగంలోకి దిగకముందే ముందస్తుగా ప్రచారాన్ని మొదలుపెట్టి ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా బరిలో నిలిచిన తనను గెలిపించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

# విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

## కష్టపడే స్వభావం అలవర్చుకోవాలి -లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోటివేషన్ అవగాహన సదస్సులు






**సత్తుపల్లి /ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడే స్వభావాన్ని అలవర్చుకోవాలని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితేనే విజయాలు సాధ్యమని మోటివేషనల్ స్పీకర్ కోడే సతీష్ (నల్గొండ), వ్యక్తిత్వ వికాస బోధకులు పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కాకతీయ డిగ్రీ కళాశాల, విశ్వశాంతి విద్యాలయంలలో విద్యార్థులకు మోటివేషన్ అవగాహన సదస్సులు నిర్వహించారు.


లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోడే సతీష్, పసుపులేటి నాగేశ్వరరావులు మాట్లాడుతూడ క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, కష్టపడే స్వభావం, ఇతరులను గౌరవించడం, స్వీయ నియంత్రణ, సామాజిక బాధ్యత, సానుకూల దృక్పథం వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. పరీక్షల ప్రిపరేషన్, ప్రజెంటేషన్ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన సదస్సులో సమాజ నిర్మాణంలో మహిళల కీలక పాత్ర, విద్య, ఆర్థిక అభివృద్ధిలో మహిళల సాధన, భవిష్యత్తు లక్ష్యాల రూపకల్పనపై వివరించారు. ఉన్నత చదువులపై స్పష్టత సాధించి వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతతో చదవాలని, కష్టపడే స్వభావాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు వీరారెడ్డి, దొడ్డ కృష్ణయ్య, మందపాటి చెన్నారెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెడిటేషన్ సర్టిఫికేట్ కోర్సు ఘన ముగింపు



## ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్

**నర్సంపేట/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో విద్యార్థుల మానసిక ఉల్లాసం, ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసాన్ని లక్ష్యంగా ప్రారంభించిన మెడిటేషన్ (ధ్యానం) సర్టిఫికేట్ కోర్సు 30 రోజుల అనంతరం సోమవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తీవ్రమైన విద్యా మరియు మానసిక ఒత్తిడులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ధ్యానం విద్యార్థులకు మానసిక ప్రశాంతతను కలిగించడంతో పాటు, జీవితాన్ని క్రమశిక్షణతో ముందుకు నడిపించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కోర్సులో నేర్చుకున్న ధ్యాన పద్ధతులను విద్యార్థులు నిత్యజీవితంలో కొనసాగించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని విలువాధారిత సర్టిఫికేట్ కోర్సులను కళాశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కోర్సు కో–ఆర్డినేటర్ ఎస్. కమలాకర్ మాట్లాడుతూ, ధ్యానం కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాకుండా ఒక సంపూర్ణ జీవన విధానమని అన్నారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, సానుకూల దృక్పథం గణనీయంగా పెరిగిందని, విద్యార్థుల స్పందన ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని తెలిపారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ మాట్లాడుతూ, శాస్త్రీయ దృక్పథంతో రూపొందించిన ఈ సిలబస్ మానసిక విజ్ఞానం మరియు పురాతన ధ్యాన పద్ధతుల సమ్మేళనంగా ఉందని తెలిపారు. అకడమిక్ అభివృద్ధితో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కూడా ఈ కోర్సు ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బైరి సత్యనారాయణ మాట్లాడుతూ, ధ్యానం వల్ల ఒత్తిడిని కలిగించే హార్మోన్లు తగ్గి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని వివరించారు. రక్తపోటు నియంత్రణ, గుండె ఆరోగ్యం మెరుగుదల, నిద్రలేమి సమస్యల నివారణలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. స్టాఫ్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఎం. రాంబాబు మాట్లాడుతూ, మానసిక ప్రశాంతత ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, ఆ ప్రశాంతత సాధనకు ధ్యానం అత్యంత ఉపయుక్తమని తెలిపారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# వర్ధన్నపేటలో చార్జ్ షీట్ రాజకీయం

## కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ ధ్వజం -వర్ధన్నపేట గడ్డపై కమలం జెండా ఎగరాలి...







**వర్ధన్నపేట/ఫిబ్రవరి 2 (జర్నలిస్ట్ వార్త):** రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అభివృద్ధిని విస్మరించి కేవలం ఇసుక మాఫియా పైనే దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని బీజేపీ నాయకులు హెచ్చరించారు. సోమవారం వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ టీ రాజేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తదితరులు కలిసి ఎమ్మెల్యే నాగరాజు పనితీరుపై 15 అంశాలతో కూడిన 'చార్జ్ షీట్'ను విడుదల చేశారు. గడిచిన రెండేళ్లలో ఎమ్మెల్యే నాగరాజు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని బీజేపీ నేతలు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని వారు ప్రశ్నించారు. ముఖ్యంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని చార్జ్ షీట్ లో పేర్కొన్నారు.

కోనారెడ్డి చెరువును కబ్జాదారుల నుండి కాపాడతానని చెప్పి ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? వాగు కోనాచెలం నుండి కోనారెడ్డి చెరువు వరకు సీసీ కాలువల నిర్మాణం ఏమైంది? చెరువు పారకం కాలువల అభివృద్ధిని ఎందుకు విస్మరించారు? ఆకేరు వాగు–చెక్ డ్యాం పునరుద్ధరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఎందుకు ఉన్నాయి? పట్టణ ప్రజలను వేధిస్తున్న కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం ఏది? అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కళాశాల పనులు పూర్తి చేయడంలో జాప్యం ఎందుకు? రెండేళ్లలో మున్సిపాలిటీలో ఒక్కటంటే ఒక్క కొత్త పనినైనా మొదలుపెట్టారా? 100 పడకల ఆసుపత్రి విషయంలో కేవలం ఎన్నికల వ్యూహంతో రాజకీయాలు చేయడం తగదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయి? ఇళ్లు లేని పేదలకు కాకుండా కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు, పెన్షన్లు ఇవ్వడం పక్షపాతం కాదా? మున్సిపాలిటీలో పార్క్ నిర్మాణం హామీ ఏమైంది? మున్సిపాలిటీలో పూర్తయిన పనులకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదు? ఇసుక మాఫియాపై ఉక్కుపాదం వేస్తామని చెప్పి, ఇప్పుడు వారితోనే చేతులు కలిపారా? ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారు.

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు నైతికత లేదని, వర్ధన్నపేట గడ్డపై ఈసారి కమలం జెండా ఎగరడం ఖాయమని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. 12 డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్ , కన్వీనర్, కో కన్వీనర్ లు ముత్తిరెడ్డి కేశవరెడ్డి , మళ్ళది తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షులు కొండేటి అనిత సత్యం ,వర్ధన్నపేట ఎన్నికల ప్రభారీ గుజ్జుల సత్యనారాయణ,ఎన్నికల కన్వీనర్ మైస రాము,మున్సిపల్ ఎన్నికల ప్రభారీ జిల్లా కార్యదర్శి రాయపురం కుమారస్వామి, మాజీ వైస్ జడ్పీ చైర్మన్ గజ్జెల శ్రీరాములు,డా వన్నాల వెంకటరమణ, మొశీడేటి మహేందర్ రెడ్డి, గడ్డం మహేందర్, పొన్నగోటి వెంకట్రావు, ఎంపీ అనిల్, కొండిటి బాబు, నాయిని నరేందర్,కె.వి రంజన్, కర్క సోమిరెడ్డి, నిమ్మాని సోమేశ్వరరావు,కుచన క్రాంతి కుమార్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..


# పద్మాజీవాడ అభివృద్ధికి వ్యవసాయ విద్యార్థినుల ప్రణాళిక







## సర్పంచ్ ప్రశంస

**సదాశివనగర్/ఫిబ్రవరి2(జర్నలిస్ట్ వార్త):** గ్రామ సమస్యల గుర్తింపునకు, సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన విశ్లేషణ బాగుందని పద్మాజీవాడ సర్పంచ్ లోకోటి సుబ్బారావు అన్నారు. సోమవారం సదాశివనగర్ మండలం పద్మాజీవాడ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఒక చిత్రపటం (చపాతీ మ్యాప్) ద్వారా గ్రామంలోని సమస్యలను, రైతులకు అందుతున్న సేవలను స్పష్టంగా వివరించారు. ఈ ప్రదర్శనను సర్పంచ్ సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులు కొత్త రకం విత్తనాలను సాగు చేస్తూ దిగుబడి పెంచుకోవాలని కోరారు. ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించే బాధ్యత రైతులదేనని పేర్కొన్నారు. కళాశాల సమన్వయకర్త అనిల్ రెడ్డి మార్గదర్శకత్వంలో విద్యార్థినులు ఎల్. పూజిత, వి. పూజిత, మిద్దెపాక దీవెన, ఎం. శ్రీచందన, యు. అనూహ్య, ఎస్. కావేరి గ్రామంలో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. నీటి సౌకర్యం, విద్యుత్, మార్కెట్ వంటి అంశాలను పరిశీలించి, గ్రామాభివృద్ధికి అడ్డుగా ఉన్న సమస్యలను సర్పంచ్, పెద్దల దృష్టికి తెచ్చారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, రైతులు పాల్గొని విద్యార్థినుల కృషిని మెచ్చుకున్నారు

# కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి కోటి ఆర్థిక సాయం అందించాలి

.. రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి



**స్టేషన్ ఘన్ పూర్/ఫిబ్రవరి2 (జర్నలిస్ట్ వార్త) :** నిజాంబాద్ జిల్లాలో ఎక్సైజ్ కానిస్టేబుల్ పద్మశాలి ముద్దుబిడ్డ సౌమ్య వీధి నిర్వహణలో గంజాయి ముఠాచేతిలో మృతి బాధాకరమని,ఆమె కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహ ణలో ఉన్న మహిళా అధికారిపై మత్తులో ఉన్న గంజాయి స్మగ్లర్లు దాడులకు తెగబడడం ఆందోళ నకరమని అన్నారు. మత్తు పదార్థాల రవాణా వినియోగంపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు.ఆమె మృతికి కారుకులైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# సిసి కెమెరా లో జగ్గు తండా పంచాయతీ

## చెత్త ఎక్కడబడితే అక్కడ వేస్తే జరిమానా తప్పదు.

## సర్పంచ్ బొల్లి జయంతి కృష్ణ.



**,బయ్యారం/ ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);** మండలంలో జగ్గు తండ పంచాయతీలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని ఎన్నిసార్లు చెప్పినా కొంతమంది ప్రధాన రోడ్ల వెంట కోళ్ల వ్యర్థాలను, ఇతర చెత్తచెదారాన్ని వేయడంపై పంచాయతీ సర్పంచ్ బొల్లి కృష్ణ జయంతి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నివారణ కోసం చెత్త వేసే ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి చెత్త వేసిన వారిని గుర్తించేందుకు ముందస్తు కార్యక్రమాలలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెత్త వేసి పర్యావరణాన్ని పాడు చేయవద్దని, ప్రధాన రహదారుల వెంట వెళ్లే వాహనదారులకు దుర్గంధం వెదజల్లి అనారోగ్యం పాలవుతారని , అలాంటి అసౌకర్యాన్ని కల్పించవద్దని వేడుకున్నారు.పంచాయితి పరిధిలో ఒకవేళ చెత్త వేసినట్లు గుర్తించిన వారిపై పంచాయతీ రాజ్ ఆక్ట్ ప్రకారం చర్యలు తీసుకొని అట్టి వారిపై జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా పర్యావరణాన్ని కాపాడాలని వేడుకున్నారు

## రెండు తెలుగు రాష్ట్రాల్లో పులుల కలకలం..

# భయం గుప్పిట్లో జనం



మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

**ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త):** పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లినీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

**యాదాద్రి జిల్లాలోనూ ఇదే సీన్..** యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది.

## చర్లపల్లి విషాదం.. ఒంటరితనమే

# తల్లీబిడ్డల ప్రాణం తీసిందా?

**హైదరాబాద్ శివార్లలో ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య**

**ఒంటరితనమే ఈ దారుణానికి కారణమని పోలీసుల ప్రాథమిక అంచనా**

**కారులో సూసైడ్ నోట్.. వాట్సప్‌లో స్టేటస్‌గా పెట్టిన విజయరెడ్డి**

**విజయరెడ్డి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**కుటుంబ, ఆస్తి గొడవల కోణంలోనూ కొనసాగుతున్న దర్యాప్తు**



**ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);** హైదరాబాద్ శివార్లలో జరిగిన తల్లీబిడ్డల ఆత్మహత్య ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్‌పై ఐటీ ఉద్యోగిని విజయరెడ్డి తన ఇద్దరు పిల్లలు చేతన, విశాల్‌తో కలిసి బలవన్మరణానికి పాల్పడటం తెలిసిందే. ఈ దారుణానికి ఆమెలో పేరుకుపోయిన ఒంటరితనమే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.వివరాల్లోకి వెళితే... ఉప్పల్ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన విజయరెడ్డికి సురేందర్‌రెడ్డితో 2007లో వివాహమైంది. భర్త సురేందర్‌రెడ్డి నాలుగేళ్లుగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుండటంతో, విజయరెడ్డి తన తల్లితో కలిసి ఉంటున్నారు. నగరంలోని ఓ ఐటీ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న ఆమె, నైట్ షిఫ్టుల కారణంగా పిల్లలిద్దర్నీ హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారు. అయితే, భర్తకు దూరంగా ఉండటం, పిల్లలు కూడా అందుబాటులో లేకపోవడంతో గత 15 రోజులుగా ఆమె తీవ్రమైన ఒంటరితనంతో బాధపడుతున్నట్లు బంధువులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని స్నేహితులతో చెబుతూ ఆవేదన చెందేవారని తెలిసింది.శనివారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి పిల్లలను కారులో తీసుకెళ్లిన విజయరెడ్డి, చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద కారు పార్క్ చేశారు. అక్కడే పార్కింగ్ స్లిప్ వెనుక "నాకు బతకాలని లేదు. నేను లేకపోతే పిల్లలు అనాథలవుతారు. అందుకే నాతో పాటే తీసుకెళ్తున్నా" అని సూసైడ్ నోట్ రాశారు. ఆ నోట్‌ను ఫొటో తీసి తన వాట్సప్ స్టేటస్‌గా కూడా పెట్టుకున్నట్లు తెలిసింది. అనంతరం పిల్లలతో కలిసి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలంలోని కారు నుంచి సూసైడ్ నోట్‌ను, విజయరెడ్డి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపనున్నారు. ఆత్మహత్యకు ముందు ఆమె ఎవరితో మాట్లాడారు, చాటింగ్ వివరాలపై ఆరా తీస్తున్నారు. కుటుంబ కలహాలు లేదా ఆస్తి తగాదాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన, సొసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి.



**బయ్యారం/ ఫిబ్రవరి2) జర్నలిస్ట్ వార్త);** మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో మబ్బు వెంకన్న గత కొన్ని రోజుల గా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని వార్త తెలుసుకొని మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకుపల్లి నరేందర్, రామచంద్రపురం సర్పంచ్ ఉప సర్పంచ్ లు మంగలాల్, తొట్టి కృష్ణ, వార్డు మెంబర్లు జానీ, ఇతర నాయకులు బరిగల ఉపేందర్, సుమన్ ,సతీష్ ,సాయికుమార్, సందీప్ ,నిమ్మల అఖిల్ ,నాశబోయిన గణేష్ తదితరులు పాల్గొన్నారు

# వరి నాట్లలో కాలిబాటలు విడవాలి

## రైతులు అధిక దిగుబడులను సాధించాలి .-ఏవో రాజు



**బయ్యారం/ ఫిబ్రవరి 2(జర్నలిస్ట్ వార్త,);** మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో కడియాల వెంకటరావు వ్యవసాయ క్షేత్రం సందర్శించి వరినాట్లు పరిశీలించి మండల వ్యవసాయ అధికారి ఏవో రాజు రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ వరి నాట్లు వేయడంలో మహారాష్ట్ర కూలీలు తనదైన శైలిలో వరి నాట్లు వేసి కాలి బాటలు విడిచిపెట్టడం జరుగుతుందని దీని ద్వారా సస్యరక్షణ సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. వ్యవసాయ శాఖ ఎల్లప్పుడూ రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తూ శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహిస్తుందని దీనిని రైతులు ఆచరించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# మేడారం జాతర విజయవంతం

## ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక -మంత్రి సీతక్క వెల్లడి



ములుగు,**ఫిబ్రవరి 2, (జర్నలిస్ట్ వార్త);** మేడారం సమక్క - సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారని ÷ర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.